క్లుప్తంగా

సజావుగా ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

తనకల్లు: మండల పరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగింది. 6, 7, 8, 9వ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 31 మంది హాజరు కావాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరనాయుడు తెలిపారు. ప్రవేశ పరీక్షను డిపార్ట్‌మెంటల్ అబ్జర్వర్ విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఈనెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ జరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికై నట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఆదివారం క్రీడాకారులను అభినందించారు. ఇటీవల అనంతపురం జిల్లాలో ఇండోర్ స్టేడియంలో జరిగిన టోర్నమెంట్‌లో ధర్మవరం క్రీడాకారులు సంజయ్‌కుమార్, సల్మా ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి హిదయ్‌తుల్లా తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

పూర్వ విద్యార్థుల కలయిక



గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001–02 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరడంతో సందడి నెలకొంది. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో తిరుగుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం గురువులకు పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రమాదరాణి, లక్ష్మీనరసు, శంకర్‌బాబు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని మేడాపురంలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి కింద రూ.15వేలు మేడాపురానికి చెందిన కుంట కింద ఆంజనేయులు వృషభాలు, నీరుగంటి హరి వృషభాలు ద్వితీయ బహుమతి కింద రూ.10 వేలు, న్యామద్దెలకు చెందిన పూజారి సుబ్బయ్య వృషభాలు రూ.8వేలు తృతీయ బహుమతి, ముష్టి కోవెలకు చెందిన శ్రీరాములు వృషభాలు నాల్గో బహుమతి గెలుపొందాయి.

సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అలంకరణలో సంగమేశ్వరుడు

కొత్తచెరువు: మండల కేంద్రంలోని బుక్కపట్నం రహదారిలో ఉన్న సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏటా సంగమేశ్వర స్వామి కల్యాణోత్సవం, రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా హోమాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు హంస వాహనంపై సంగమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఈనెల 7వ తేదీ వరకూ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త మనోహర్, పూజారి సాయి తెలిపారు.

జగనన్నను ఆశీర్వదించండి

- రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీ చెరువు: చింతమానుపల్లి, గుర్రప్పగారిపల్లి గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. తొలుత సర్పంచ్ జగన్‌మోహన్ చౌదరి ఆధ్వర్యంలో కేరళ వాయిద్య కళాకారుల ప్రదర్శనతో ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. కాటంరెడ్డిపల్లి నుంచి చింతమానుపల్లి వరకూ నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజాసంక్షేమ పథకాలను వివరించారు. జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అర్హత ఉండి పెన్షన్, ఇల్లు మంజూరు కానివారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, తహసీల్దార్ శ్రీధర్, హైసింగ్ ఏఈ హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ ఫర్వీన్ భాను, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ జగన్‌మోహన్ చౌదరి, వినోద్‌కుమార్ నాయుడు, ఎంపీటీసీ గణేష్‌రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మండల చైర్మన్ లక్ష్మీరెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎద్దుల వెంకటరంగారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి, నాయకులు వెంకట నారాయణ, సుధాకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, నాగిరెడ్డి, దుర్గాప్రసాద్ నాయక్, విజయశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

2024లో వైఎస్సార్‌సీపీదే విజయం

కొత్తచెరువు: ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలు గమనిస్తున్నారని మ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని మరువ ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలసి విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మా నమ్మకం నువ్వే జగనన్న, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన లభించిందన్నారు. టీడీపీ ఒంటరిగా పోటీ చేయలేక జనసేనతో జత కట్టడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి పార్టీలు ఎన్ని ఏకమైనా జగన్ ప్రభంజనం ముందు నిలువ లేవన్నారు. నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఎన్నికై నప్పటి నుంచి ఇచ్చిన హామీల కంటే అదనంగా ఎన్నో నెరవేర్చానని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే, ఫోర్‌లేన్ రోడ్డు, శ్రీసత్యసాయి జిల్లా సాధించి పెట్టి పుట్టపర్తి నియోజకవర్గానికి గుర్తింపు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. గత టీడీపీ పాలనలో గ్రామాల్లో కనీసం రహదారులు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పుడు మాత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనులన్నీ గతంలో తాము చేపట్టామని డబ్బా కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, లాయర్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులు గ్రామాభివృద్ధికి చిహ్నాలు

ఓడీ చెరువు: రహదారులు గ్రామీణాభివృద్ధికి చిహ్నాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండకమర్ల రోడ్డు నుంచి చింతమానుపల్లికి రూ.1.09 కోట్లతో వేసిన తారురోడ్డును ప్రారంభించారు. అనంతరం చింతమానుపల్లిలో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని అగ్రిబోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం నారప్పగారిపల్లి నుంచి శెట్టివారిపల్లి, రామిరెడ్డిపల్లి, బోడెద్దుల వారిపల్లి వరకూ రూ.2 కోట్లతో సీసీ, తారురోడ్డు పనులను ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామీణ రహదారులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



రాహుల్‌నాయక్

నల్లమాడ: మండలంలోని కొత్తపల్లికి తండాకు చెందిన డుంగావత్ రాహుల్‌నాయక్ చదువులో రాణిస్తున్నాడు. తాజాగా విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 1,963 ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. మెరుగైన ర్యాంక్ సాధించిన రాహుల్ నాయక్‌ను పలువురు అభినందించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం సచివాలయం పరిధిలోని చిప్పలమడుగు, నడింపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 7 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని పార్టీ మండల కన్వీనర్ ప్రకాష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు వాహనాల వేలం

నల్లచెరువు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ వరలక్ష్మి ఆదివారం తెలిపారు.

వైభవంగా ఆర్జిత కల్యాణోత్సవం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభుడికి ఆర్జిత కల్యాణం జరిపించారు. అంతకుముందు స్వామి వారిని పట్టువస్త్రాలు, కదిరి మల్లెలు మాలలు, తులసీ పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

పరామర్శ

ఓడీ చెరువు: అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని కుసుమవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జయరామిరెడ్డికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి భరోసా ఇచ్చారు. జయరామిరెడ్డి భార్య కళావతమ్మ (48) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కర్నూలు ఆస్పత్రిలో ఆదివారం మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు రావడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కళావతమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అంతకుముందు మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకుడు వెల్డింగ్ బాషాను పరామర్శించారు.

వైఎస్సార్‌సీపీకే ప్రజల మద్దతు

- 'జగనన్నే మా భవిష్యత్' సూపర్ సక్సెస్
- ఎమ్మెల్యే సిద్దారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి: రాష్ట్రంలో ఇంత వరకూ ఏ రాజకీయ పార్టీ ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించలేదు. జగన్ ప్రభుత్వం నిర్వహించిన తాజా సర్వేతో ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని రుజువైంది అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ కావడంతో ఆదివారం ఎమ్మెల్యే తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీలో 1.16 కోట్ల కుటుంబాలు జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలిపినట్లు సర్వేలో వెల్లడైందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పడానికి ఇంతకన్నా వేరే నిదర్శనం లేదని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు జగన్ ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందజేస్తోందన్నారు.

చంద్రబాబుకు ఇక భవిష్యత్ లేదు..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, మహిళలకు రిజర్వ్ చేస్తూ చట్టం చేశారు. ఇలా దేశంలో ఎక్కడా చేయలేదు. నామినేటెడ్ నుంచి క్యాబినెట్ వరకూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సింహభాగం పదవులు కల్పించి సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చారు. ప్రజల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. దీన్ని బట్టి టీడీపీకి ఇక భవిష్యత్ లేదని అర్థమవుతోంది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలనే తాను కూడా కొనసాగిస్తానని చంద్రబాబు చెబుతున్నారు. 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు ఎవరిని అనుసరిస్తున్నారో ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తెలియజేశారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు

మేము అధికారంలోకి వస్తే మహానేత వైఎస్సార్ ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్‌ను ఎత్తివేస్తామని భారతీయ జనతా పార్టీ చెబుతోందన్నారు. అలాంటి పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి చంద్రబాబు తెగ ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. దీన్ని బట్టి చంద్రబాబు కూడా ముస్లింల రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ముస్లింల పక్షాన ఉంటూ వారికిచ్చిన రిజర్వేషన్‌కే మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కదిరి ఎంపీపీ అమరనాథరెడ్డి, కదిరి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకట నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

ధర్మవరం: స్థానిక ఇందిరా నగర్‌లో ఉన్న పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం 15వ ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, కంకణధారణ, కలశ స్థాపన, నవగ్రహాల ఆరాధన పూజలు చేశారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని కదిరి రోడ్డులో ఉన్న వీర బ్రహేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు. స్వామిని అలంకరించి పూజలు చేశారు.

రైతు మృతి

నల్లచెరువు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నివాసముంటున్న దేవిరెడ్డి లోకేశ్వర్‌రెడ్డి (46) క్రిమి సంహారక ద్రావకం సేవించి ఆదివారం మృతి చెందాడు. వివరాలు.. లోకేశ్వర్ రెడ్డి ఆదివారం మధ్యాహ్న సమయంలో బీసీ కాలనీలోని తన నివాసం నుంచి పొలం వద్దకు వెళ్లాడు. తాను క్రిమి సంహారక ద్రావకం సేవించి చనిపోతున్నట్లు భార్యకు ఫోన్‌లో తెలిపాడు. భార్య ప్రమీళ హుటాహుటిన పొలం దగ్గరకు చేరుకుంది. 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే లోకేశ్వర్‌రెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలు చదువులు, పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వరలక్ష్మి తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

బత్తలపల్లి: మండలంలోని జ్వాలాపురం గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట, కల్యాణోత్సవ కార్యక్రమాలు ప్రారంభమైనట్లు ఆలయ అర్చకుడు జయసింహ, దేవదాయ శాఖ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ తెలిపారు. 5వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల కన్వీనర్ ఆదినారాయణ ఆర్థికసాయం అందించారు. న్యామద్దల లో మృతి చెందిన వార్డు మెంబర్ చాకలి మల్లికార్జున కుటుంబానికి రూ.10 వేలు, కురుబ శివ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కనుముక్కలలో నాగులకట్ట, పాండురంగ స్వామి ఆలయాలకు రూ.15 వేలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి ఆదివారం అందజేశారు. సర్పంచ్ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మాధవరాజుల స్వామి పరుష

కనగానపల్లి: మండలంలోని బద్దలాపురంలో మాధవరాజులు స్వామి వైభవంగా జరుగుతోంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ పరుషలో ఆదివారం స్వామికి గంగ పూజ, జలధి పూజలు చేశారు. సాయంత్రం స్థానిక కళాకారులతో సప్తమాంకముల నాటకాన్ని ప్రదర్శించారు. పరుషను తిలకించేందుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

అమడగూరు: మండలంలోని మహమ్మదాబాద్ సమీపంలో ఆదివారం నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. అందిన సమాచారం మేరకు గ్రామ పొలాల్లో తనిఖీలు చేయగా 4 వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడినట్లు తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.29,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జమేదారు సుధాకర్, సిబ్బంది భాస్కర్, విజయ్, చంద్ర, రత్నాకర్, భార్గవ్ పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం

బత్తలపల్లి: మండలంలో శనివారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. ఎం.చెర్లోపల్లికి చెందిన శ్రీనివాసులు పొలంలో దాదాపు 2,500 అరటి చెట్లు నేలకూలాయి. రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. తన ఐదెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట నేలమట్టమై రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బత్తలపల్లికి చెందిన శ్రీరాములు ఆవేదన వ్యక్తం చేశాడు. వ్యవసాయశాఖ అసిస్టెంట్లు ఆదివారం ఆయా గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేశారు. నివేదికలు ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిసింది.

గాండ్లపెంట: గాండ్లపెంటలో శనివారం రాత్రి జోరుగా వర్షం కురిసింది. 76.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ సిబ్బంది ఆదివారం తెలిపారు.

తాగిన మైకంలో బీరుబాటిల్‌తో దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని గ్లాసుల ఫ్యాక్టరీ వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధర్మవరానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తిపై దాడి చేశారు. తాగిన మైకంలో బీరుబాటిల్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి సత్యనారాయణను చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైజంక్షన్‌లో టూవీలర్ ఢీకొని...

స్థానిక ఎస్కేయూ వైజంక్షన్ వద్ద టూవీలర్ తగిలి పాదాచారి తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ వెంకటేశ్ నాయక్ తెలిపిన మేరకు.. ఆదివారం రాత్రి కాలినడకన వెళ్తున్న భవానీనగరుకు చెందిన రవిని గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనింది. గాయపడిన అతడ్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఓబులేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట



పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఎమ్మెల్సీ టి.కల్పలతా రెడ్డి



విరాళం అందజేస్తున్న బత్తల హరిప్రసాద్, పూల శ్రీనివాసులు రెడ్డి

తలుపుల: బండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన ఓబుళేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఓబుళేశ్వర స్వామి, లక్ష్మీదేవి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి, కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతా రెడ్డి తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకుడు గోపీనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, ఎంపీపీ రఫీనాయక్, ఫయాజ్ అహమ్మద్, సర్పంచులు శ్రీరామ్ రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డికే బాబు, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్, సీనియర్ నాయకుడు బత్తల వెంకటరమణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బత్తల హరిప్రసాద్ ఆలయ అభివృద్ధికి తన వంతుగా రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, లీగల్ సెల్ నాయకుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పథకాలను వివరిస్తున్న ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరించారు. ఏయే పథకాలు అందాయని ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి, ఈడిగ కృష్ణా, కొండారుపల్లి శేఖర్ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: రాష్ట్రంలో మంచిపాలన అందిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని న్యామద్దల గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్, సర్పంచ్ సుశీలమ్మ, ఎంపిటిసి కేశన్న, నాయకులు క్రిష్టప్ప, భాస్కర్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత జయంతి



ధర్మవరం అర్బన్: హారతులు ఇస్తున్న వాసవీ మహిళా మండలి సభ్యులు



నల్లచెరువు: వాసవీ మాత చిత్రపటం ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



పుట్టపర్తి టౌన్: కుంకుమార్చనలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

తాడిమర్రి/తలుపుల/పుట్టపర్తి టౌన్/ధర్మవరం అర్బన్/నల్లచెరువు/కొత్తచెరువు/చెన్నేకొత్తపల్లి: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఆదివారం కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో వాసవీమాత జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పూజ, పంచామృతాభిషేకం, కలశపూజ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ధర్మవరం పట్టణంలోని కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని బంగారు పట్టుచీరతో అలంకరించి పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు పాండురంగ స్వామి ఆలయం నుంచి ప్రధాన కలశాలను ఎత్తుకుని మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారి దేవాలయానికి చేరుకుని ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ధర్మవరం పట్టణంలో వాసవి మహిళా మండలి సభ్యులు 102 రకాల హారతులతో మహా మంగళ హారతి ఇచ్చారు. నల్లచెరువులో బసవన్న కట్ట నుంచి బస్టాండు కూడలి వరకూ వాసవీమాత చిత్రపటాన్ని మహిళలు ఊరేగించారు.

ఆలయానికి విరాళం

కదిరి అర్బన్: మండల పరిధిలోని సున్నపుగుట్ట తండాలోని సేవాలాల్ గుడికి ఆదివారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అల్లాబకాష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వెంకటేష్ నాయక్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నేడు జాబ్ అచీవర్స్ డే

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జాబ్ అచీవర్స్ డే నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. ఈ డ్రైవ్‌లో సుమారు 40 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గరుడంపల్లి క్రాస్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏపుగా ముళ్ల పొదలు పెరగడంతో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆదివారం రూరల్ ఎస్‌ఐ ప్రదీప్ కుమార్ సొంత నిధులు వెచ్చించి జేసీబీతో ముళ్ల పొదల తొలగింపు పనులు చేపట్టారు.